క్లుప్తంగా

రేపు వైఎస్సార్ ఆసరా పంపిణీ

కారెంపూడి: శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మహోత్సవం జరగనుందని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా డ్వాక్రా పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. ఈ ఏడాది వైఎస్సార్ ఆసరా కింద రూ.6.94 కోట్లు విడుదలైనట్లు పేర్కొన్నారు. 2023–24కు గాను 945 డ్వాక్రా గ్రూపులకు చెందిన 9,450 మందికి రూ.6.94 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. అలాగే 2020–21లో ప్రభుత్వం రూ.6.92 కోట్లు అందించగా, 2021–22లో రూ.6.96 కోట్లు, 2022–23లో రూ.6.94 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో మొత్తం రూ.27.76 కోట్లు మండలంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరాగా అందించడం జరిగిందని ఎంపీడీవో వివరించారు.

ఎంపీడీవోగా వెంకటరమణ

దాచేపల్లి : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శోభారాణి ఎంపీడీవో వెంకటరమణకి బాధ్యతలు అప్పగించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి తదితరులు ఎంపీడీవోని కలిసి అభినందించారు.

ఎంపీపీగా బొమ్మిన సావిత్రి



కారెంపూడి: కాపుల చిరకాల కోరిక శుక్రవారం తీరనుంది. ఎంతో కాలంగా కాపులకు ఎంపీపీ పదవి కావాలనే మండల కాపుల కోరికను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నెరవేర్చనున్నారు. ప్రస్తుతం వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న కారెంపూడి 2 ఎంపీటీసీ బొమ్మిన సావిత్రిని ఎంపీపీ సీట్లో శుక్రవారం కూర్చోబెట్టనున్నారు. ప్రస్తుతం ఎంపీపీగా కొనసాగుతున్న మేకల శారదాశ్రీనివాసరెడ్డి సెలవు పెట్టడంతో ఎంపీపీ బాధ్యతలు నెరవేర్చేందుకు వైస్ ఎంపీపీగా ఉన్న సావిత్రిని ఎంపీపీ స్థానంలో పీఆర్కే కూర్చోబెట్టనున్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఆహ్వానించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు సామాజిక వర్గాలకు ఎంపీపీ పదవి కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ పీఆర్కే, పార్టీ పెద్దలు అప్పట్లో నిర్ణయించారు. రెడ్డి, కాపు, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన ఎంపీటీసీలకు ఎంపీపీ పదవి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి పదవి కాలం రెండేళ్లు పూర్తి కావడంతో రెండవ ఎంపీపీగా కాపు సామాజిక వర్గానికి చెందిన సావిత్రికి ఇవ్వనున్నారు. తర్వాత కమ్మ సామాజిక వర్గానికి ఎంపీపీ పదవి దక్కనుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం పదవి మార్పిడి జరగనుంది.

లారీని ఢీకొన్న ఆర్టీసీ అద్దెబస్సు

యడ్లపాడు: ఆర్టీసీ అద్దెబస్సు లారీని ఢీకొనడంతో పెనుప్రమాదం తప్పింది. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి నెల్లూరుకు ప్రయాణికులతో బయలుదేరి యడ్లపాడు గ్రామం ఎస్ఎస్ఎల్ మిల్లు సమీపంలో ముందు వెళ్తున్న పీవీసీ పైపుల లోడు లారీని ఢీకొంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో లారీ వెనుకభాగం, బస్సు ముందుభాగం భారీగా ధ్వంసమయ్యాయి. బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కోవడంతో కాళ్లకు గాయాలయ్యాయి. బస్సులో 19 మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్వల్పంగా గాయలవ్వడంతో అందరూ దిగి ఇతర బస్సుల్లో వెళ్లిపోయారు. డ్రైవర్‌ను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నైతిక విలువలపై పరీక్షలు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలో రెండురోజుల పాటు పరిసరాల విజ్ఞానం, మానవతా నైతిక విలువలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను వెలికితీయడానికి దోహదపడతాయన్నారు. ప్రశ్నపత్రాలు కూడా ఆన్‌లైన్‌లో వస్తాయని మార్కుల ఆధారంగా కొంతమేర ఫైనల్ పరీక్షల్లో కొన్ని మార్కులు కలుస్తాయన్నారు.

సచివాలయంలో డిజిటల్ సేవలపై అవగాహన



అచ్చంపేట: గ్రామ సచివాలయాల్లో డిజిటలైజేషన్ ద్వారా త్వరితగతిన అందుతున్న సేవలను గురువారం స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కట్టా శివన్నారాయణ వారికి సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయో వివరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీని పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపల్ టి.అరుణ్‌కుమార్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎ.సుబ్బారావు ఉన్నారు.

అభివృద్ధి పథాన దాచేపల్లి

- మారుతున్న నగర పంచాయతీ రూపురేఖలు
- రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- నవరత్నాల ద్వారా రూ.200 కోట్ల మేర లబ్ధి



ఇరికేపల్లిలో నిర్మించిన సచివాలయం



దాచేపల్లి : అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నగర పంచాయతీ నిలుస్తుంది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి గ్రామాన్ని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయటంతో అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తూ ఆదర్శ పట్టణంగా రూపుదిద్దుకుంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ ప్రజలకు రూ.200 కోట్ల మేర లబ్ధి జరగగా, సుమారు రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.

రోల్‌మోడల్‌గా జగనన్న కాలనీ..

దాచేపల్లి నగర పంచాయతీలోని జగనన్న కాలనీ రోల్‌మోడల్‌గా నిలుస్తుంది. సుమారు రూ.16 కోట్లు విలువ చేసే 76 ఎకరాల్లో అర్హులైన 3,330 మంది నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. జగనన్న కాలనీలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో రోడ్లు, కరెంట్, నీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ 675 ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మరి కొన్ని ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

అభివృద్ధి పరుగులు..

నగర పంచాయతీలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఒకప్పుడు కనీస వసతులు కూడా లేని దాచేపల్లి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత మౌలిక వసతుల కల్పనలో బాగా మెరుగుపడింది. కొట్లబజార్ అధ్వానంగా ఉండటంతో రూ.2.50 కోట్లతో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు. నారాయణపురం ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి నడికుడి వార్డు సచివాలయం వరకు రూ.3.20 కోట్లతో తారు రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. ముత్యాలంపాడు రోడ్డులో ఆక్రమణలు తొలగించి రూ.18 లక్షలతో ఆధునీకరణ చేశారు. రూ.16.50 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులకు శ్రీకారం చుట్టారు. మరో రూ.2.73 కోట్లతో తాగునీటి సమస్యలు పరిష్కరించారు. ఇరికేపల్లిలో వార్డు సచివాలయ భవనం నిర్మించి, మరి కొన్ని ప్రభుత్వ భవనాలు ఆధునీకరణ చేసి సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్లుగా ఉపయోగిస్తున్నారు. కాటేరు వాగుని రూ.20 లక్షలతో ఆధునీకరణ చేసి వరద ముప్పు నుంచి రక్షించారు. నాడు–నేడు ద్వారా రూ.2.50 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. రూ.1కోటి వ్యయంతో షాదీఖానా నిర్మించారు.



దాచేపల్లి కొట్ల బజార్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్డు



నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



దాచేపల్లిలో జగనన్న కాలనీ

కొట్లబజార్‌లో వ్యాపారాలు పెరిగాయి..



గతంలో కొట్ల బజార్‌కి రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడేవారు. మట్టిరోడ్డు కావటం..రోడ్డు కూడా ఇరుకుగా ఉండటంతో అన్ని రకాలుగా ఇబ్బంది పడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రూ.2.50 కోట్లతో కొట్లబజార్‌లో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. కొట్లబజార్‌లో ఆక్రమణాలు కూడా తొలగించటంతో రోడ్డు విశాలంగా ఉంది. ఈ రోడ్డు ఎప్పటి నుంచో బాగు చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ రోడ్డు బాగు చేయటం వలన రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంది. మా వ్యాపారాలు కూడా పెరిగాయి.

–వందనపు వెంకట్రామయ్య, బంగారం వ్యాపారి, దాచేపల్లి

షాదీఖానా నిర్మించి ముస్లింల అభిమానం పొందారు..



దాచేపల్లిలో ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం రూ. కోటి వ్యయంతో ఏసీ షాదీఖానా నిర్మించారు. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమైంది. దాచేపల్లి నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నగర పంచాయతీని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇప్పుడు జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారు.

–షేక్ దాదీ, దాచేపల్లి

అభివృద్ధి, సంక్షేమం అంటే కళ్లరా చూశాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం అంటే కళ్లరా చూశాం. మా పిల్లలకు అమ్మఒడి వస్తుంది. నా భార్యకి వైఎస్సార్ ఆసరా, ఇంటి పట్టా వచ్చింది. పిల్లలు, భార్య ద్వారా సంక్షేమం చూశాం. మా సొంతింటి కలను సాకారం చేసుకుని అభివృద్ధిని చూస్తున్నాం. మాలాంటి నిరుపేదలకు ఇంత కంటే ఇంకేం అవసరం లేదు.

–కటికాల మరియదాసు, దాచేపల్లి

అభివృద్ధి, సంక్షేమం మా నినాదం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పడిన దాచేపల్లి నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఒక వైపు ప్రజలకు సంక్షేమం అందిస్తూ మరో వైపు అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రోత్సాహంతో మరిన్ని అభివృద్ధి పనులు చేసి దాచేపల్లిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం.

–కొప్పుల సుబ్బమ్మ, నగర పంచాయతీ చైర్‌పర్సన్

గ్రామాల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

- రూ.5.6 కోట్లతో ప్రతి ఇంటికి మంచినీరు
- రూ.1.83 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం
- రూ.52 కోట్లతో రైల్వే బ్రిడ్జికి ఆదివారం శంకుస్థాపన



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: అభివృద్ధి పథంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి గ్రామాన్ని ముందుకు తీసుకొని వెళ్తుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జానపాడు, పందిటివారిపాలెం, జూలకల్లు, గుత్తికొండ గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరాకు శంకుస్థాపన ఆయన చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.

- నియోజకవర్గంలోనే పెద్ద గ్రామమైన జానపాడు చిరకాల స్వప్నమైన రైల్వే బ్రిడ్జిని రూ.52 కోట్లతో నిర్మించబోతున్నామని, వచ్చే ఆదివారం శంకుస్థాపన చేసి18 నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు. జానపాడు ప్రజలకు రైల్వే బ్రిడ్జి నిర్మాణం వలన ప్రయాణం సులభతరం అవుతుందని అన్నారు.
- రూ.4.10 లక్షలతో జానపాడు గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటిని అందిస్తున్నామని చెప్పారు.
- పందిటివారిపాలెం గ్రామంలో రూ.1.06 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందిస్తున్నామన్నారు.
- జూలకల్లు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.
- గుత్తికొండ గ్రామంలో రూ. 62 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీలు అభివృద్ధి చెందాయంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషేనన్నారు. ప్రతి గ్రామం రూపురేఖలు మారుస్తున్నారని, ఏ ప్రభుత్వం మంచి చేసిందో, అభివృద్ధి చేసి చూపించిందో ప్రజలే గమనించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు సాతులూరి బాబు, గార్లపాటి అనసూర్య, వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పూర్ణయ్య, తాళ్లపోగుల మర్యాదరావు, ఇనుముక్కల పాపులమ్మ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు మన్నెం శ్రీను, కోటేశ్వరరావు, చిన్నబోతుల శ్రీనివాసరావు, రాణిరాంబాబు, రాజేశ్వరివెంకటేశ్వర్లు, మొగిలి అన్నపూర్ణమ్మ, వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు మస్తాన్‌వలి, బుడే, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ఉన్నం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం నరసింహారావు, కొతారు నరసింహారావు, మోర్జంపాడు కాశీం, లక్ష్మయ్య, మాజీ జెడ్పీటీసీ నల్లబోలు రామారావు, బండ్ల రామారావు, కావూరి రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ నారికేళ్ల సాంబశివరావు, నల్లబోలు రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఆర్యవైశ్యులు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు ఆర్యవైశ్య నాయకులు గురువారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో చేరారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో ఆర్యవైశ్య నాయకులను ఎమ్మెల్యే కాసు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్న తీరు, రాష్ట్రంలో ఉత్తమ పరిపాలనతోపాటు గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు చేపట్టిన అభివృద్ధి, ఆర్యవైశ్యులకు కల్పిస్తున్న సముచిత స్థానం పట్ల ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు దేవరశెట్టి పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి భవిరిశెట్టి మల్లికార్జునరావు, రెడీమేడ్ డ్రెసెస్ అసోసియేషన్ కోశాధికారి గుడివాడ సురేష్‌కుమార్, ఆర్యవైశ్య నాయకులు ఉడతా శ్రీనివాసరావు, ఉడతా సుబ్బలక్ష్మీ, గుండా గంగాధరరావు, గుండా శిరిషలు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ కౌన్సిలర్ జూలకంటి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ చీదేళ్ల కృష్ణ, పతంగి అమర్, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందంజ



మండల పరిషత్ సమావేశం జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి : అభివృద్ధిలో మండలం ముందంజలో ఉందని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. పలు అంశాలపై చర్చించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చామని, జగనన్న కాలనీల్లో లెవలింగ్ పనులు కూడా చేశామని చెప్పారు. ప్రతి పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించామని, పౌర సేవలతో పాటు వైద్య సేవలూ గ్రామాల్లో అందేలా చర్యలు తీసుకున్నామని ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ఆధారంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించామని, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని, పిల్లలను ప్రశాంతంగా పాఠశాలలకు పంపి చదివించుకుంటున్నారని అన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బ్రాహ్మణపల్లి బైపాస్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు.. బ్రాహ్మణపల్లి నుంచి శ్రీనివాస్ నగర్ క్యాంప్‌కు వీరంకి శ్రీనివాసరావు(47) నడుచుకుంటూ వెళ్తున్నారు. గుంటూరు–2 డిపోకు చెందిన గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు బ్రాహ్మణపల్లి బైపాస్ మీదుగా వెళ్తుండగా నడుచుకుంటూ వస్తున్న వీరంకి శ్రీనివాసరావును ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారావు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఎం జగన్‌కు బీసీల కృతజ్ఞతలు

ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ ఎంపికైన సందర్భంగా బీసీ నాయకుల సంబరాలు



పిడుగురాళ్ల పట్టణంలో సంబరాలు నిర్వహిస్తున్న బీసీ నాయకులు

పిడుగురాళ్ల: అనిల్‌కుమార్‌యాదవ్‌ను నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించంతో పట్టణంలోని బీసీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ అభ్యర్థిని ప్రకటించింది వైఎస్సార్‌సీపీయేనని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరు కృతజ్ఞతలతో ఉంటామని, రాబోయే ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించటంతోపాటు నరసరావుపేట పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఎమ్మెల్యేలను గెలిపించుకుంటామని బీసీ నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బాణసంచా కాల్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పులి వెంకట బాలకాశీ, జడ సురేంద్రబాబు, బీసీ నాయకులు పులి వెంకటేశ్వర్లు, చింతల జానకిరామయ్య, కొంగని రమణయాదవ్, పులి నరసింహారావు, కొంగని ప్రసాద్, షేక్ సుభానీ, షాదిక్, మెట్టా బాలకృష్ణ, బత్తుల శ్రీను, బత్తుల వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, సైదయ్య, గోగుల మల్లియాదవ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షికోత్సవ ఆశీర్వాద పండుగ

మాచర్ల: పట్టణంలోని 10వ వార్డులోని సెరిన్ కాలనీలోని క్రీస్తు సువార్త పరిచర్య ప్రార్థన మందిరం 24వ వార్షికోత్సవం సందర్భంగా 3, 4, 5 తేదీలలో ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు సంఘ ఆశీర్వాద పండుగను నిర్వహిస్తామని పాస్టర్ పి.ఆనందరావు గురువారం తెలిపారు. ముఖ్య అతిథులుగా పాస్టర్లు అబ్రహం, మరియదాసు, స్టీవెన్ జ్ఞాన్‌కుమార్‌లు పాల్గొని క్రైస్తవులకు ఆశీర్వాదాలు అందిస్తారన్నారు. పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేడు కానుకమాత దేవాలయం 174వ తిరునాళ్ల



తిరునాళ్లకు ముస్తాబు అయిన కానుకమాత దేవాలయం



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న రెవ.ఫాదర్ పీటర్ పాపయ్య, ఫాదర్లు రాజశేఖర్‌రెడ్డి, అగస్టీన్

రెంటచింతల: మండే హృదయాలలో సైతం ప్రేమను వర్షించే ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కానుకమాత చర్చి 174వ తిరునాళ్ల వేడుకలు నిర్వహించనున్నట్లు విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి గురువారం తెలిపారు. ఈ తిరునాళ్లలో కులమతాలకు అతీతంగా వేలాదిమంది భక్తులు పాల్గొని కానుకమాత కరుణాకటాక్ష వీక్షణాలు పొందాలని కోరారు. ఉదయం 9.30 గంటలకు నల్గొండ మేత్రాసన విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవ.గోవింద్ జోజి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో ఫాదర్లతో పండుగ పవిత్ర సమిష్టి మహోత్సవ దివ్యపూజాబలి నిర్వహించనున్నారు. జెయింట్ వీల్స్, బ్రేక్‌డాన్స్, పలు రకాల రంగులరాటాలు, పెద్ద సంఖ్యలో అంగళ్లు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ప్రాంతాలలో ఉన్న గ్రామస్తులు తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పండుగ దివ్యపూజాబలి అనంతరం కోలాట ప్రదర్శన, సాయంత్రం 3 గంటలకు మరియతల్లికి కొవ్వొత్తుల సమర్పణ ఉంటుందన్నారు. రాత్రి 10 గంటలకు బాణసంచా కాలుస్తూ దేవాలయం నుంచి కానుకమాత తేరు ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 174వ మహోత్సవంలో భాగంగా గురువారం అంతోని వారి కాలనీలోని అంతోని వారి మందిరంలో నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి నేతృత్వంలో రెవ.ఫాదర్ యద్దనపల్లి పీటర్ పాపయ్య, ఫాదర్లు నిర్వహించిన సమిష్టి దివ్యపూజాబలిలో భక్తులనుద్దేసించి ఫాదర్ పీటర్‌పాపయ్య మాట్లాడారు. క్రైస్తవులు ప్రతి రోజు మరియతల్లిని ప్రార్థించాలన్నారు. కథోలికులందరూ ప్రతి రోజు మరియతల్లిని ప్రార్థిస్తూ కరుణామయురాలు అయిన ఆ తల్లి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ దివ్యపూజాబలిలో ఫాదర్లు అగస్టీన్, ఏరువ రాజశేఖర్‌రెడ్డి, బ్రదర్ నిఖిల్ తేజ, చర్చి పెద్దలు, కన్యాస్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.

సాతులూరులో ఘనంగా ఘటం ఊరేగింపు



నాదెండ్ల: సాతులూరులో గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఘటం (కుండ) ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఘటంతో సంప్రదాయబద్ధ మేళతాళాలతో ఉదయం 6–9 గంటల వరకు గ్రామోత్సవంతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సద్దిని సమర్పించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎంపిక



ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం జీసస్ క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక జిల్లా ముఖ్య పరిపాలనాధికారి చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా నందిగం సుందరరావు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మహేష్, సెక్రటరీగా అల్లి సిల్వెస్టర్, ట్రెజరర్‌గా వాడపల్లి ఇశ్రాయేల్, గౌరవాధ్యక్షులుగా ఇరిగి మరియానందం ఎంపికయ్యారు. పాస్టర్ కుక్కమూడి యోహాను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిలకలూరిపేటకు చెందిన పాస్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో జీసస్ క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్‌ను బలోపేతం చేయాలన్నారు. పాస్టర్లందరూ కలిసికట్టుగా సంఘ అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎ.డి.ప్రసాద్, ముత్తయ్య, అల్లి ఇమ్మానియేలు, అల్లి గురవయ్య, నవీన్‌కుమార్, బొనిగె చిన్నయ్య, దానియేలు తదితరులున్నారు.

పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు



పెదపాలెంలో పురుగు మందు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట: వ్యవసాయ శాఖ అనుమతులతోనే పెస్టిసైడ్స్ మందులు విక్రయించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి బి.వెంకటేశ్వర్లు పెస్టిసైడ్స్ దుకాణదారులను హెచ్చరించారు. పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. మిట్టపాలెంలో ఏ విధమైన అనుమతి పత్రాలు లేని రూ.4,47,499 విలువగల 219 లీటర్ల పురుగు మందు విక్రయాలను నిలిపివేశారు. పెదపాలెంలో శ్రీలక్ష్మీనరసింహ ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.2,14,500 విలువగల 58 లీటర్ల పురుగు మందు అమ్మకాలను నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే అన్ని దుకాణాలను సందర్శించడం జరిగిందన్నారు. దుకాణాదారులు తప్పనిసరిగా అమ్మకపు రిజిస్టర్లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకుంటూ ఉండాలన్నారు. స్టాక్ బోర్డులు, ధరల పట్టికలను ప్రతి షాపులోనూ ఉంచాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించడం నేరమన్నారు. రైతులకు విక్రయించిన ప్రతి పెస్టిసైడ్స్‌కి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు.